క్లుప్తంగా

ఘనంగా అన్న సమారాధన



అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులు

సామర్లకోట: స్థానిక పాత్రుళ్ల వీధిలో సోమవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యరక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీ నారాయణ, మాజీ అయ్యరక కార్పొరేషన్ రాష్ట్ర చైర్ పర్సన్ ఆవాల రాజేశ్వరిలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని ఆలయ కమిటీ నాయకులు అన్నదానం ఏర్పాటు చేశారు. సుమారు ఐదువేల మందికి అన్నదానం చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. కమిటీ నాయకులు పెదిరెడ్ల కృష్ణ, బొడుగు ప్రసాద్, ఎలిశెట్టి శివాజీ, కర్రి ఉమామహేశ్వరరావు, కర్రి విజయ్, కర్రి రామకృష్ణ, పెదిరెడ్ల రాజు, వెలిశెట్టి త్రిమూర్తులు భక్తులకు సేవలందించారు.

మార్మోగిన శివ నామం



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామివారు

సామర్లకోట: పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు బారులు తీరారు. స్వామివారికి ప్రీతికరమైన సోమవారం, ఏకాదశి పర్వదినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. తెల్లవారు జామున స్వామి వారి తొలి అభిషేకం, తొలి పూజ తిలకించడానికి భక్తులు బారులు తీరారు. పిఠాపురం మహారాజ గోత్ర నామాలతో తొలి పూజ చేశారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాదం, సాయంత్రం ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆలయ శ్రీ చక్ర పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, అభిషేక పండితులు అళ్లకి రాజ్‌గోపాల్ శర్మ, అర్చకులు సన్నిదిరాజు వెంకటరమణ, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



వాగులో మృతదేహం

కొత్తపల్లి: మండలంలో పొన్నాడ శివారు పల్లిపేట సమీపంలోని వాగులో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు సోమవారం గుర్తించారు. సుమారు 50 ఏళ్ల వయసు ఉండొచ్చని గుర్తించారు. మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరచడం జరుగుతుందన్నారు. ఎస్సై వెంకటేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు



పెద్దాపురం	
లలితా స్క్రీన్-1	వీనమ్
లలితా స్క్రీన్-2	దేవర పార్ట్-1
వీరభద్ర	లగ్గం
శోభా	పొట్టేల్
సామర్లకోట	
అనుశ్రీ స్క్రీన్-1	దేవర పార్ట్-1
అనుశ్రీ స్క్రీన్-2	జనక అయితే గనక
విఘ్నేశ్వర	వీనమ్
పిఠాపురం	
అన్నపూర్ణ	గ్యాంగ్ స్టార్
శ్రీపూర్ణ	దేవర
శ్రీసత్య	సత్యం సుందరం
శ్రీవెంకటేశ్వర	మిస్టర్ సెలబ్రిటీ
ఉప్పాడ	
శ్రీనివాస	దేవర

వైకల్యాన్ని జయించాడు..!

వినపడదు, మాట్లాడలేడు.. కాని కంటితో చూశాడంటే గోల్ పడాల్సిందే. ఆటతో మాటను గెలిచాడు. వైకల్యాన్ని విజయంతో జయించాడు. జాతీయ క్రీడాకారుడిగా ఎదిగి దేశానికి పతకాలు తేవాలన్నదే తన గోల్ అంటున్నాడు పిఠాపురానికి చెందిన దివ్యాంగ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు ఉమ్మిడి ఏసు కుమార్.

- బాస్కెట్ బాల్ క్రీడలో దూసుకుపోతున్న బధిర క్రీడాకారుడు ఏసు కుమార్
- ఆసియా, పసిఫిక్ బధిర బాస్కెట్ చాంపియన్ షిప్‌కు ఎంపిక
- వెల్డింగ్ పని చేస్తూ కుటుంబానికి చేదోడు
- జాతీయ క్రీడాకారుడిగా ఎదగాలన్నదే లక్ష్యం

పిఠాపురం: పిఠాపురానికి చెందిన ఉమ్మిడి సుబ్బారావు వెంకటలక్ష్మి దంపతులు నిరు పేద కుటుంబానికి చెందిన వారు. సుబ్బారావు ఆటో డ్రైవరుగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఏసు కుమార్ పుట్టుకతోనే దివ్యాంగుడు. అయినప్పటికీ చిన్నప్పటి నుంచి ఆత్మ విశ్వాసంతో చదువు సాగించి బీకాం వరకు చదువుకున్నాడు. చదువు పూర్తయ్యాక ఉద్యోగాల కోసం ప్రయత్నం చేశాడు. అవకాశాలు రాక పోవడంతో తన కుటుంబానికి చేదోడుగా ఉండాలన్న సంకల్పంతో ఒక వెల్డింగ్ షాపులో డైలీ లేబర్‌గా చేరి కుటుంబానికి చేదోడుగా మారాడు. వినపడక పోవడంతో వెల్డింగ్ పనిలో పలు మార్లు ప్రమాదానికి గురయ్యాడు. చదువుకుంటునే పిఠాపురంలో ఉన్న ఆట స్థలాల్లో బాస్కెట్ బాల్ ఆడుతున్న క్రీడాకారుల వద్దకు వెళ్లి ఆట చూస్తూనే అందులో మెలుకువలు నేర్చుకునే వాడు. ఈ క్రమంలో ఈ ఆటకు ఆకర్షితుడయ్యాడు. ఎవరూ శిక్షణ ఇవ్వకుండానే బాస్కెట్ బాల్ ఆటలో ప్రావీణ్యం సంపాదించాడు. అతని ఆట తీరును చూసిన స్థానిక క్రీడాకారులు వివిధ పోటీలకు అవకాశం కల్పించడంతో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పలు పతకాలు సాధించి జొరా అనిపించాడు. ఇటీవల బెంగుళూరులో నిర్వహించిన దివ్యాంగుల బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ క్రీడాకారులను ఆకట్టుకున్నాడు. దీంతో జాతీయ స్థాయి దివ్యాంగుల బాస్కెట్‌బాల్ శిక్షణకు ఈ కుర్రాడిని ఎంపిక చేశారు.

ఏసు కుమార్ ఇంటర్నేషనల్ బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ (డీఐబీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆసియా, పసిఫిక్ బధిర బాస్కెట్ చాంపియన్ షిప్‌కు భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించే జట్టుకు ఎంపిక అయ్యాడు. ఆస్ట్రేలియా దేశం మెల్‌బోర్న్‌లో జరిగే పోటీలకు దేశ వ్యాప్తంగా 12 మంది క్రీడాకారులు ఈ చాంపియన్ షిప్‌కు ఎంపిక కాగా మన తెలుగు రాష్ట్రాల నుంచి ఏసు కుమార్ ఒక్కడే ఎంపిక కావడం విశేషం.



కుటుంబానికి చేదోడుగా నిలిచేందుకు వెల్డింగ్ పని చేస్తూ..



బాస్కెట్ బాల్ గోల్ వేస్తూ..

పతకాల సాధనే లక్ష్యం



పిఠాపురం పేరు చెబితే బాస్కెట్‌బాల్ క్రీడకు పెట్టింది పేరు. అందుకే ఆ క్రీడలోనే ఉన్నతికి చేరాలని స్వయం శక్తితో ఆట నేర్చుకున్నా. స్థానిక బాస్కెట్ బాల్ క్రీడాకారులు, నా స్నేహితులు మంచి ప్రోత్సాహం అందించారు. దీంతో అతి తక్కువ కాలంలోనే ఆటలో మెళకువలు నేర్చుకున్నా. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సహకారం మరువలేను. ఇటీవల బెంగుళూరులో ఆడిన ఆటతో నా ప్రతిభను గుర్తించి జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడా శిక్షణకు ఎంపిక చేయడంతో నాకు మొక్కవోని మనోబలం చేకూరింది. జాతీయ స్థాయిలో పతకాలు సాధించి దేశానికి మంచి పేరు తీసుకురావడంతో పాటు పిఠాపురంకు జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడమే లక్ష్యంగా పెట్టుకున్నాను.

– ఉమ్మిడి ఏసు కుమార్, దివ్యాంగ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు, పిఠాపురం.

జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదగాలి

మాట, వినికిడి శక్తి లేక పోయినా మనోబలంతో ఆటలో ప్రావీణ్యం సంపాదించాడు ఏసు కుమార్. అతని ఆట తీరు చూస్తే ఔరా అనిపిస్తుంది. ఆటలో దిగాడంటే ఇక గోల్ మీద గోల్ సాధించడమే తప్ప వెనుకడుగు వేయడం ఉండదు. బెంగుళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడా శిక్షణకు ఎంపిక చేశారు. ఇంటర్నేషనల్ బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ (డిఐబిఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆసియా, పసిఫిక్ బధిర బాస్కెట్ చాంపియన్ షిప్‌కు భారత దేశం నుంచి ప్రాతినిధ్యం వహించే జట్టుకు ఎంపిక అయ్యాడు. రాష్ట్ర, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూర్తి సహకారం అందిస్తున్నాం. ఏసుకుమార్ జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదగాలన్నదే మా ఆకాంక్ష.

– బొజ్జా మాణిక్యాలరావు, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి, పిఠాపురం.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వ సభ్య సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగ తాయారు అధ్యక్షత వహిస్తారన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఆయా మున్సిపల్ విభాగాల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

సామర్లకోట: మున్సిపల్ పాలక మండలి సాధారణ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ ఏ శ్రీవిద్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగే కౌన్సిల్ సమావేశంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాలో 20 అంశాలను పొందుపరిచినట్లు తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

నేడు సీజీఎం సైకిల్ సువార్త యాత్ర

పెద్దాపురం: తిరుపతి క్రిష్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) సైకిల్ సువార్త యాత్రను మంగళవారం మండలంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్, క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరాల వ్యవస్థాపకులు నంగిన సత్యానందం తెలిపారు. ప్రపంచ శాంతికై ఏటా సుమారు 100 సీజీఎం బృందాలు సైకిల్ యాత్ర నిర్వహించి ప్రార్థనలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది యాత్ర తిరుపతిలో బయలుదేరి మర్లావ, తుర్పుపాకల, జె.తిమ్మాపురం, జగ్గంపేట మండలం కాట్రావులపల్లి, గండేపల్లి మండలం రామేశంమెట్ట మీదుగా బిక్కవోలు చేరుకుందన్నారు. అక్కడ నుంచి పెదబ్రహ్మదేవం, మేడపాటు, వేట్లపాలెం, సామర్లకోట, జి.రాగంపేట, గోరింట, దివిలి మీదుగా తిరుపతికి చేరుకుంటుందని వివరించారు.

కూటమి ప్రభుత్వానివి బూటకపు వాగ్దానాలు

సీపీఎం జిల్లా నేత దువ్వా శేషుబాబ్జి



మహాసభలో ప్రసంగిస్తున్న దువ్వా శేషుబాబ్జి

పెద్దాపురం: కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుకను సత్వరం అందుబాటులోకి తీసుకురావాలని దీపావళి నుంచి అమలు చేస్తామని ప్రకటించిన దీపం పథకాన్ని ప్రతీ ఒక్కరికి వర్తించేలా చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా నేత దువ్వా శేషుబాబ్జి డిమాండ్ చేశారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం సీపీఎం నాయకులు కేదారి నాగు అధ్యక్షతన సీపీఎం జిల్లా మహా సభలు ప్రారంభయ్యాయి. తొలుత సీపీఎం పతాకాన్ని సీనియర్ నాయకులు చల్లా విశ్వనాథం ఆవిష్కరించారు. అనంతరం మహాసభలను ఉద్దేశించి శేషుబాబ్జి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లో కొత్తగా ఒరిగిందేమీ లేదన్నారు. మద్యం ఏరులై పారుతుందని, పథకాల ఊసే లేదన్నారు. ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకువచ్చి తద్వారా భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడతారని కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారని, బీజేపీకి సాగిలపడతారని కాదన్నారు. ఇటీవల మృతి చెందిన సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఆర్ఎస్, బుద్ధదేవ్ భట్టాచార్య, కొడియార్ బాలకృష్ణ తదితరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్, జిల్లా నాయకులు కరణం ప్రసాదరావు, మండల కన్వీనర్ నీలపాల సూరిబాబు, సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్, గడిగట్ల సత్యన్నారాయణ పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలేవీ..?

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని రోడ్డు మార్జిన్‌లో రోజు రోజుకు ఆక్రమణలు పెరిగిపోతున్నా మున్సిపల్ అధికారులు మౌనం వహించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక మెహర్ కాంప్లెక్స్ నుంచి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వరకు ఇటీవల కాలంలో ఆక్రమణలు పెరిగి పోయాయి. వాహనాల రాకపోకల తాకిడి ఎక్కువగా ఉండటంతో రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయనే వాదనలు ఉన్నాయి. ఆయా షాపుల వద్ద వాహన చోదకులు ఆగి సరకులు కొనుగోలు చేయడంతో ఇబ్బంది ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు ఆక్రమణలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో వెలసిన దుకాణం

విద్యార్థుల్లో సృజనను వెలికితీయాలి



పీబీ దేవం పాఠశాలలో విద్యార్థుల పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శివరామ కృష్ణయ్య

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల వ్యక్తిగత నైపుణ్యాలను మెరుగు పరిచి వారిలో సృజనను వెలికితీసే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి వై శివరామ కృష్ణయ్య సూచించారు. మండల పరిధిలోని పీబీ దేవం గ్రామంలో ఎలిమెంటరీ పాఠశాలలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. నూరు శాతం విద్యార్థులు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల రాత నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాలలోని పరిసరాలు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

ఏటీఎం చోరీ కేసులో నిందితుడికి జైలు

పిఠాపురం: పిఠాపురం పట్టణంలో ఏటీఎం చోరీ కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్ష , రూ.1000లు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. పిఠాపురం పట్టణ ఎస్సై మణికుమార్ కథనం మేరకు ఈ ఏడాది ఏప్రిల్ 2న అర్ధరాత్రి సమయంలో పిఠాపురం పట్టణ చర్చి సెంటర్ సమీపంలో ఉన్న డీసీసీ బ్యాంక్ ఏటీఎం పగులగొట్టి అందులో నుంచి రూ.1100లు దొంగిలించబడినట్లు డీసీసీ బ్యాంక్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుపై పిఠాపురం టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా పిఠాపురం పట్టణం చెరుకుల కాలువ దగ్గర నివాసముంటున్న పెనుబోతుల సూరిబాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా నేరం రుజువు కావడంతో పెనుబోతుల సూరిబాబుకి నాలుగేళ్ల ఒక వారం రోజులు జైలు శిక్షతో పాటు రూ.1000లు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల లీల నాగ రోజా వాదనలను వినిపించారు.

అమరజీవుల త్యాగాలు చిరస్మరణీయం



రక్తదానం చేస్తున్న డీఎస్పీ శ్రీహరి రాజు

పెద్దాపురం: అమర జీవుల త్యాగాలు చిరస్మరణీయమని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు అన్నారు. అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక రోటరీ క్లబ్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం ఎస్ఐ మౌనిక అధ్యక్షతన జరిగిన సభలో డిఎస్పీ శ్రీహరి రాజు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. సమాజం కోసం అశువులు బాసిన వారి త్యాగాలు వెలకట్టలేనివన్నారు. రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట సీఐలు క్రాంతికుమార్, కృష్ణ భగవాన్, వైఆర్‌కే శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, ఆయా సచివాలయాల మహిళా పోలీసులు, ఆటో యూనియన్ వర్కర్లు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాలు సంభవిస్తే బాధ్యులెవరు?

- ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో తరచూ ప్రమాదాలు
- వాకతిప్పలో అవస్థలు పడుతున్న విద్యార్థులు
- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి

కొత్తపల్లి: ఉప్పాడ- పిఠాపురం రోడ్డులో పాఠశాలల సమీపంలో విద్యార్థులు రోడ్డు దాటే ప్రాంతంలో వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. స్పీడ్ బ్రేకర్ లేకపోవడంతో వాకతిప్పలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో వేగంతో దూసుకు వెళుతున్న వాహనాలతో ప్రజలు, విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాకతిప్ప ఎంపీపీ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు యూనియన్ బ్యాంకు వద్ద రోడ్డు దాటి పాఠశాలకు వెళుతుంటారు. ఏ వైపు నుంచి ఏ వాహనం వచ్చి ఢీకొడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఇక్కడ అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. స్థానికంగా ఉన్న యూనియన్ బ్యాంకుకు వచ్చే ఖాతాదారులు రోడ్డు దాటే సమయంలో భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలకు వెళ్లే రోడ్డు ప్రదేశంలో స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఉప్పాడ- పిఠాపురం రోడ్డులో యూనియన్ బ్యాంకు వద్ద రోడ్డు దాటుతున్న విద్యార్థులు

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి



కార్యదర్శుల సమావేశంలో సూచనలిస్తున్న ఎంపీడీఓ రవికుమార్

కొత్తపల్లి: గ్రామ పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ పి.రవికుమార్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కాలువలు పూడికతో నిండిపోవడం వల్ల మురికినీరు రోడ్లపై ప్రవహిస్తోందన్నారు. తాగు నీరు కలుషితం కాకుండా పైపులైన్ల లీకేజీలను అరికట్టాలన్నారు. ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

కొత్తపల్లి: దీపావళికి విక్రయించే బాణసంచా దుకాణాలు రేకు షెడ్లలోనే ఏర్పాటు చేయాలని తహసీల్దారు జి చిన్నారావు సూచించారు. పలు గ్రామాల్లో దుకాణాల అనుమతులపై సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి అనుమతులు లేకుండా షాపులను ఏర్పాటు చేస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మందు గుండు సామాగ్రిని అక్రమంగా నిల్వ ఉంచినా చర్యలు తప్పవన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర న్యాయం



పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించడం జరుగుతుందని పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి అన్నారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో డివిజన్ పరిధిలో గల మండలాల నుంచి పది అర్జీలు అందినట్లు ఆర్డీఓ తెలిపారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతీ అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు స్పందనకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టామన్నారు. మండల స్థాయిలో తహీసల్దార్ కార్యాలయాల వద్ద ఆయా శాఖల మండల స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, అడిషనల్ డీఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ సరిత, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ ఏఈ రవిశంకర్, చప్పిడి దయానందరాజు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ లైబ్రరీకి సాహిత్య గ్రంథాల అందజేత

సామర్లకోట: మండల పరిధిలోని మాధవపట్నం శివారు ప్రాంతమైన జమునానగర్‌లో అంగర లక్ష్మీ కాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'బాల మందిరం' పిల్లల గ్రంథాలయానికి బాల సాహిత్య గ్రంథాలను ఆర్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా వర్స్ అధినేత రంకిరెడ్డి సోమవారం సాయంత్రం అందజేశారు. ఈ పుస్తకాలు చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడతాయని బాల మందిరం వ్యవస్థాపకుడు, కవి అంగర గోపాలకృష్ణ తెలిపారు. విద్యార్థులకు సులభంగా అవగతమయ్యే రీతిలో ఈ పుస్తకాలు ఉన్నాయన్నారు. కథలు, పాటలు, పద్యాలు చక్కని బొమ్మలతో ఆకర్షణీయంగా పుస్తకాలను తయారు చేశారన్నారు. పుస్తకాలు అందజేసిన రంకిరెడ్డి సుబ్బరాజుకు బాల మందిరం నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



బాల మందిర గ్రంథాలయానికి చేరుకున్న పుస్తకాలు